నేడు గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇంటర్వ్యూలు

ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాటి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గెస్ట్ ఫ్యాకల్టీలకు ఈనెల 3వ తేదీ మంగళవారం ఇంటర్వ్యూలు జరగనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెరికల్చర్, వృక్షశాస్త్రం బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు వారి సిరికల్చర్‌కి గ్రాడ్యుయేషన్ వృక్షశాస్త్రానికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లతో ఈనెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో వారి పూర్తి బయోడేటాతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపికైన వారు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలోని ఏడు ప్రభుత్వ ఐటిఐలు, తొమ్మిది ప్రైవేట్ ఐటిఐలో ప్రవేశం కొరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన జూన్ 4,5 తేదీలలో జరుగుతుందని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ యం.రవీంద్ర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ప్రవేశాల కొరకు జూన్ 4న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు, పదవ తరగతిలో 6.8–10 జిపిఏ, మెరిట్ 1 నుంచి 95 వరకు గల వారు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పదవ తరగతిలో 5.3–6.7 జిపిఏ, 96–200 మెరిట్ గల వారు హాజరు కావాలన్నారు. జూన్ 5న ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పదవ తరగతిలో 5.2–2.2 జిపిఏ, మెరిట్ 201 నుంచి 314 వరకు గల వారు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పదవ తరగతిలో 5.3–6.7 జిపిఏ, 96–200 మెరిట్ గల వారు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో చిత్తూరు ప్రభుత్వ ఐటిఐకి హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 77999 33370, 98850 49760, 94936 29036 నంబర్లను సంప్రదించవచ్చు అని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫోన్‌కాల్ ద్వారా తెలియజేయబడుతుందని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాలలో
మౌలిక వసతులు కల్పించాలి

సిడిపిఓలు, సూపర్ వైజర్‌లు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి : రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనలు చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్య కుమారి పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నీటి అవసరాల కొరకు పైప్‌లైన్‌లు, బోర్‌వెల్స్, సింటెక్స్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు అప్రోచ్ రోడ్ చేయాలని, బాల్యవివాహాలు కట్టడి చేయాలన్నారు. చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని బాల్య వివాహాలు కట్టడి చేయాలన్నారు. కిషోరి వికాసం ద్వారా కౌమార దశలో గర్భం దాల్చడంపై వచ్చే ఆరోగ్య, ఆర్థిక సమస్యలను కిషోర బాల బాలికలకు వివరించాలన్నారు. సెర్ప్, డిఆర్‌డిఏ, డిపిఓ, డిఎం అండ్ హెచ్‌ఓలు సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మేనరికం వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్ వైజర్‌లు క్రమంగా అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించాలన్నారు. తక్కువ బరువు ఉన్న అంగన్వాడీ పిల్లలకు పోషకాహారం అందించాలన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ హాజరు వంద శాతం ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల వివరాలను మండలాల వారీగా పంపాలన్నారు. అంగన్వాడీ పిల్లల ఎత్తు బరువులను కచ్చితత్వంతో కొలవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ పిల్లల తక్కువ బరువుకు గల కారణాలను ప్రత్యేక అధికారులు పరిశీలించాలన్నారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యం పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. జిల్లాలో పురుషులతో పోలిస్తే స్త్రీ జనాభా తక్కువ ఉందని, లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు అరికట్టడానికి, కౌమార బాలికలు గర్భం దాల్చకుండా బేటి బచావో, బేటి పడావో ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో కౌమార గర్భాలు నమోదు కావడం జరిగిందని, దీనిని అరికట్టడానికి సిడిపిఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పని చేయాలన్నారు. ఈసమావేశంలో ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరీ, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య, పిఆర్ఎస్ ఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, మహిళా పోలీస్ ఎస్ఐ నాగ సౌజన్య పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మామిడి తోటలను పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మామిడి రైతులతో వివిధ గ్రామాలలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్ ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర సమస్య అని అన్నారు. ప్రభుత్వం ధర నిర్ణయించకుండా ఉండడం వలన ప్రస్తుతం తోతాపురి రూ. 4నుండి 5లు మధ్యలో కొంటున్నారని, రైతుకు ఖర్చు రూ.12 నుండి 15ల మధ్యలో అవుతున్నదని, రైతు వెచ్చించిన నగదు కూడా రాకపోవడంతో రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని రైతుకు మామిడి మద్దతు ధర ప్రకటించి రైతులని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గుజ్జు పరిశ్రమల యాజమాన్యంతో సంప్రదించి రైతుకు మామిడి ధర కనీసం రూ.25లు నిర్ణయించాలన్నారు. జిల్లాలో అధిక శాతం మామిడి పై ఆధారపడి జీవిస్తున్న రైతులు అధిక సంఖ్యలో ఉన్నారని మామిడి కోత దశకు వచ్చినా కూడా కచ్చితమైన ధర ప్రభుత్వం నిర్ణయించకపోవడం వలన దళారీ వ్యవస్థ అధికమైపోతున్నదని రైతుకు మద్దతు ధర ప్రకటించి రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిపై ఉందన్నారు. రైతుల సమస్యను నిర్లక్ష్యం చేయకుండా మామిడి ధర వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, రైతు సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, లోకేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

స్థలం కబ్జాపై ఆరా తీసిన అధికారులు

విచారణ చేస్తున్న ఆర్ఐ

ప్రజాశక్తి- పుంగనూరు
ఫాల్కన్ డెవలపర్స్ స్థలం కబ్జా, రక్షణ కల్పించండి అంటూ ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు తహశీల్దార్ రాముకి వినతిపత్రం ఇవ్వడంతో దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి సోమవారం ఆరా తీశారు. మేలుందొడ్డి సమీపంలో 2012లో లేఅవుట్ వేసి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలంలో ఏడాదికాలంగా లేఅవుట్లను జెసిబిలతో చదును చేసి ప్రహరీ నిర్మించుకున్నారు. ఈ సంఘటనపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫణి కుమార్, వీఆర్వో లేఔట్ దగ్గరకు వెళ్లి ఆరా తీశారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాష సహకారంతో ఇక్కడ ప్లాట్లు కొనుక్కున్న వారందరికీ అప్పుడు కొన్న రేటుకే సెటిల్ చేస్తున్నామని అధికారులకు తెలిపారు. ఈ స్థలంకు మీ వద్ద ఉన్నటువంటి డాక్యుమెంట్లు, లేఅవుట్ వివరాలను తహశీల్దార్ కార్యాలయంకు చేర్చాలని ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు తెలపవలసి ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రామలింగప్ప, విశ్రాంత డిసిసి బ్యాంకు మేనేజర్ డాబాల రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఓవర్ హెడ్ ట్యాంక్ బాగానే ఉంది

చిన్నచిన్న మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకువస్తాం: ఆర్డబ్ల్యూఎస్ డీఈ కిరణ్ తేజ

ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఈ, జేఈ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో 10 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ లోపం కారణంగా ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో 'కూలడానికి సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్' అన్న వార్త ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ డీఈ కిరణ్ తేజ, జేఈ అనూష ఓవర్ హెడ్ ట్యాంక్ వద్దకు వెళ్లి పరిశీలించి వివరాలను ప్రజాశక్తికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్ బాగానే ఉందని చిన్నచిన్న మరమ్మతులు చేయించి ఓవర్ హెడ్ ట్యాంకులోకి నీరు నింపి లీకేజీలు ఏమైనా ఉన్నాయా పరిశీలించి తదుపరి వాడుకలోకి తీసుకుచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కూల్చివేయడం అంత సులభం కాదని ఎలాగైనా వాడుకులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పైప్‌లైన్ కనెక్షన్లను ఇప్పించి తద్వారా నీటిని ట్యాంక్ లోనికి నింపి పరిశీలిస్తామని తెలిపారు. సోమల గ్రామ ప్రజల కోసం తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ఎలాగైనా సద్వినియోగంలోకి వస్తే చాలని ప్రజలు ఆశిస్తున్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారాలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి 275 అర్జీలు వచ్చాయని, రెవెన్యూ సంబంధించి 219 అర్జీలు, పెన్షన్లు, ట్రాన్స్ఫర్స్, సర్వీసుకు సంబంధించిన అర్జీలు ఉన్నాయని తెలిపారు. గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు దాదాపుగా 53 వేల వరకు అర్జీలు వచ్చాయని, గతంలో ప్రజల ప్రయాణాలలో ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించామని, నగరి నియోజవర్గంలో కూడా ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి అధికారి వారి సమస్యల పరిష్కారాలను త్వరితగతిన పరిష్కరించాలని, ఆస్తి, కుటుంబ సమస్యలు ఏదైనా ఉన్నట్లయితే ఎండోర్స్మెంట్ రాసి ఇవ్వాల్సి ఉంటుందని, ఇలా చేయడం ద్వారా జిల్లాలో సమస్యలు తగ్గుతాయని తెలిపారు. సోమవారంమే కాకుండా ప్రతిరోజు జిల్లా సచివాలయంలో మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు అర్జీలు తీసుకొబడతాయని తెలిపారు.

పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 53 ఫిర్యాదులు జిల్లా ఎస్పీ ఎన్.మణికంఠ చందోలు స్వీకరించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలనిలి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 53 ఫిర్యాదులు అందాయి. చీటింగ్ 1, బైక్ చోరీ 2, కుటుంబ తగాదాలు 6, వేధింపులు 2, ఇంటి తగాదాలు 5, భూ తగాదాలు 21, డబ్బు తగాదాలు 11, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలు 4. ఉన్నాయి.

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. నగరపాలక పరిధిలో పలువురు ప్రజలు తమ సమస్యలపై వినతులను కమిషనరుకు సమర్పించి పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో గత వారం అందిన వినతులపై సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ 3, రెవెన్యూ 2, పబ్లిక్ హెల్త్ 2, పింఛను 1 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తున్న నగర కమిషనర్

పిజిఆర్ఎస్‌కు 275 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ–ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 275 అర్జీలు అందగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు రెవెన్యూ శాఖకు సంబంధించి 219, పోలీస్ 14, పంచాయతీ రాజ్ 1, డిఆర్‌డిఏ 22, ఏపిఎస్ పిడిసిఎల్ 4, డిస్టిక్ రిజిస్టర్ 1, డీఎస్‌ఓ 8, అనిమల్ హస్బెండ్రీ 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 1, డిఎం అండ్ హెచ్‌ఓ 1, రూరల్ వాటర్ సప్లై 3, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ, ఆర్‌డిఓ, డిప్యూటీ కలెక్టర్లకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న భూముల్ని కాపాడండి

జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధ్యతలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన డికెటి పట్టా భూములను మాజీ సైనికుడు స్వామివేల్ అతని భూమి పక్కన ఉన్న భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గంగాధర నెల్లూరు మండలం కొండపల్లికి చెందిన గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో తమ గ్రామానికి చెందిన 50 మందికి పైగా వ్యక్తులకు డీకేటి పట్టా భూములు అందజేసిందని అయితే అదే ప్రాంతంలో ఆర్మీ ఉద్యోగికి సైతం 5ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తన భూమితో పాటు పక్క భూములు కూడా కబ్జా చేసేందుకు మాజీ సైనికుడు ప్రయత్నిస్తున్నారని దీనిపై ప్రశ్నిస్తే తమపై దాడులకు దిగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు జిల్లా అధికారులు స్పందించి తమ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు అందజేశారు.

వన్‌ఎం వన్‌బితో ద్రావిడ విశ్వవిద్యాలయం ఒప్పందం

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం వన్‌ఎం వన్‌బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) మధ్య విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడానికి, ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగుపరచడానికి ఒక సమయోచిత అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో ద్రావిడ విశ్వవిద్యాలయం, వన్‌ఎం వన్‌బి ఫ్యూచర్ కాలేజ్‌గా మారుతుంది. ఇది విద్యార్థులకు పరిశ్రమకు అనుగుణమైన శిక్షణ, అంతర్జాతీయ అవగాహన, ఉద్యోగ అవకాశాలలో మెరుగుదల వంటి ప్రయోజనాలను అందిస్తుంది. 2014లో స్థాపించబడిన వన్‌ఎం వన్‌బి సంస్థకు ఐక్యరాజ్యసమితి ప్రత్యేక సలహాదారు హోదా ఉంది. ఐక్యరాజ్య సమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం యునైటెడ్ నేషన్స్ ప్రధాన కార్యాలయం, న్యూయార్క్‌లో జరిగే వన్‌ఎం వన్‌బి ఆక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ ద్వారా భారతదేశంతో పాటు ప్రపంచంలోని యువ ప్రతిభావంతులను ప్రదర్శిస్తుంది. ఈ ఒప్పందం వలన ద్రావిడ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఉన్న టెక్నాలజీలు, గ్రీన్ స్కిల్స్ పై నైపుణ్య అభివృద్ధి శిక్షణ శిబిరాలు నిర్వహించబడతాయి. లీడర్‌షిప్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాలు, కెరియర్ గైడెన్స్ మరియు మెంటార్షిప్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రతినిధిత్వం చేసే అవకాశాలు వస్తాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యాన్ని సమకాలీన అవసరాలకు అనుగుణంగా, విద్యార్థులను భవిష్యత్తు సవాళ్ళకు సిద్ధం చేసే చారిత్రక అడుగుగా ప్రశంసించారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. కిరణ్ కుమార్, అకడెమిక్ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ కె.శ్యామల పాల్గొన్నారు. ఈ అవకాశాన్ని సాకారం చేయడంలో వారు కీలకపాత్ర వహించారు. విశ్వవిద్యాలయం సమగ్ర, భవిష్యత్‌కు సిద్ధమైన విద్యాదశలో ఇది పెద్ద అడుగు అని వారు తెలిపారు. వన్‌ఎం వన్‌బి సస్టైనబిలిటీ, ప్రభుత్వ అనుసంధాన శాఖ నేత మిస్ దీపికా వెంకటేష్, ఇతర వన్‌ఎం వన్‌బి ప్రతినిధులు ఈ భాగస్వామ్యంపై ఆనందం వ్యక్తం చేశారు. యువ ప్రతిభను ప్రోత్సహించడానికి, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణను పెంపొందించడానికి తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

ఒప్పంద పత్రాన్ని చూపుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దొరస్వామి

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి

అధికారులకు సూచించిన చిత్తూరు ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి సీజన్ నేపథ్యంలో మామిడి రైతులకు అధికారులు అండగా నిలవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. అదే సమయంలో తోతాపూరి మామిడిని పరిశ్రమలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని ఆదేశించారు. ధరల పతనంతో మామిడి రైతులు దిగాలు అనే వార్త కథనంపై ఆయన స్పందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మామిడి రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. చిత్తూరు పార్లమెంటులో మామిడి బోర్డ్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తుండడం అభినందనీయమని అన్నారు. మామిడి సీజన్లో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అంశంపై ఇప్పటికే పలుమార్లు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, ఆ దిశగా దిశానిర్దేశం కూడా చేసినట్లు ఆయన వివరించారు. మామిడి రైతుల విషయంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి, వారికి న్యాయం చేయాలని తెలియజేశారు. అప్పుడే ప్రభుత్వ ఆశయం కూడా నెరవేరుతుందని, మామిడి రైతుల కష్టానికి ఫలితం దొరుకుతుందన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఆర్‌జెడికి యూటీఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయ సమస్యలపై ఆర్జెడి శామ్యూల్‌కు యుటిఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. పిఎస్ హెచ్ఎం బదిలీలలో నష్టపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు నలుగురికి న్యాయం చేయాలని, టిటిడి ఉద్యోగులు స్పౌజ్ గల వారికి స్పౌజ్ పాయింట్లు వర్తింపజేయాలని, తొట్టంబేడు మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల మేనేజ్మెంట్ మార్పును సవరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు పొందిన ఉపాధ్యాయుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. సాంకేతిక సమస్యలతో పాయింట్లు నష్టపోయిన వారికి ఆ పాయింట్లను యాడ్ చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్.నాయుడు, జీవీ.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, గౌరవాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా సహాధ్యక్షులు రెడ్డప్ప నాయుడు, జిల్లా కార్యదర్శి దక్షిణామూర్తి, శేఖర్, సర్దార్, మహేష్, వాసు, మధుసూదన్ రావు, సైదులు పాల్గొన్నారు.

రేషన్ షాపును మంజూరు చేయండి..

కడా పీడీకి వినతి పత్రాన్ని అందిస్తున్న జిమ్ దాము

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం 19వ వార్డు పరిధిలో నూతన రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని స్థానిక కౌన్సిలర్ జిమ్ దాము కడ పీడీ వికాస్ మరమ్మత్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 19వ వార్డులో ఇంతవరకు రేషన్‌షాపు లేదని, లబ్ధిదారులు ఇప్పటివరకు 21వ వార్డు పరిధిలోని చౌక ధరల దుకాణానికి వెళ్లి నిత్యావసరాలను తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ రేషన్‌షాపు పరిధిలో లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉందని, దీంతో నిత్యావసర సరుకుల కోసం లబ్ధిదారులు రేషన్‌షాపు ముందు పడిగాపులు కాయాల్సి వస్తుందని, లబ్ధిదారులు అధికంగా ఉండడంతో రేషన్ పంపిణీ చేయడానికి డీలర్ సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కావున అధికారులు స్థానిక సమస్యలను గుర్తించి, 19వ వార్డు పరిధిలో మరో నూతన రేషన్‌షాపును ఏర్పాటు చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బకాయి ఉన్న ఉపాధి కూలీల నగదు వెంటనే బకాయి కూలి డబ్బును చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. సోమవారం మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేపట్టిన పనులకు గత మూడు నెలలకు నుండి కూలి డబ్బులు రాలేదని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టంలో వారానికి ఒకసారి ఉపాధి కూలీలకు నగదును పంపిణీ చేయాలని ఉందని, ఆ చట్టాన్ని అమలు చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిన వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారని, కూలి డబ్బులు రాక ఉపాధి కూలీలు ఎన్నో ఇక్కట్లు ఉన్నందున ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి బకాయి ఉన్న ఉపాధి కూలీల నగదు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దీనిపై మండల, జిల్లాస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, రైతు నాయకుడు సుబ్రహ్మణ్యం, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: సీఎం సహాయనిధి ద్వారా చెక్కులను టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. టిడిపి కార్యాలయంలో గోరివిమాకులపల్లికి చెందిన నూరిన్, బందార్లపల్లికి చెందిన సుగుణమ్మ, ననియాల విశ్వనాథ్‌కు రూ.4,97,000లు అందించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆపరేషన్లు చేసుకున్న రోగులు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమమే ధ్యేయంగా రోగుల స్థితిగతులను తెలుసుకొని వెంటనే సీఎం నిధి ద్వారా మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరామ గౌడు, నేతలు మునిరెడ్డి, మహమ్మద్ రఫీ, మనోహర్, కామరాజు నాయక్, జయశంకర్, పెరుమాళ్, వెంకటాచలం, విజయ్ కుమార్ రెడ్డి, నియాజ్ , అక్బర్,బాలరాజు, సుబ్రి, శ్రీనాథ్ రెడ్డి, ఆదిల్, సుబ్రహ్మణ్యం, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులను అరికట్టండి..

కడా పీడీకి బాధితుల వినతి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : తమ భూమిని ఆక్రమించుకోవాలన్న దురాలోచనతోనే తమ భూమిలో దుష్ట పూజలు చేశారంటూ వెంకట్రామప్ప, వారి కుమారులు వీరాస్వామి, ఆనంద్, మురుగేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం, గుడుపల్లి మండలం కప్పలనతం గ్రామంలో తమకు చెందిన స్థలాన్ని ఆ గ్రామస్తులే ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. గ్రామపరిధిలో సర్వే నెంబర్ 102/15లో 0.9 సెంట్లు భూమి ఉందన్నారు. ఈ భూమిని ఆక్రమించుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగా శనివారం అర్ధరాత్రి సమయంలో తమ భూమిలో క్షుద్ర పూజలు నిర్వహించి, త్రిశూలాన్ని పాతి పెట్టడం జరిగిందన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా కడా పీడీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అధికారులు పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గొడ్డలిపోటు దినం జరపాలి..

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో ప్రజారంజకంగా సాగుతున్న కూటమి ప్రభుత్వ పాలన చూసి ఓర్వలేక వైసిపి నాయకులు వెన్నుపోటు దినం అంటూ నాటకాలు ఆడుతున్నారని.. వాళ్లకు చిత్తశుద్ధి ఉంటే గొడ్డలిపోటు దినం జరపాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 4న వైసిపి తలపెట్టిన వెన్నుపోటు దినం ప్రజా తీర్పును, ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించడమేనని అన్నారు. వ్యవస్థలను నాశనం చేసి, దుర్మార్గాలు, దౌర్జన్యాలతో సాగిన వైసిపి పాలన నుంచి రాష్ట్ర ప్రజలు 4వ తేదీన తమ అమూల్యమైన ప్రజా తీర్పుతో వైసిపి పాలన నుంచి విముక్తి పొందారని, ఇది ప్రజలకు పండుగ రోజులా జరుపుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలు నిజమైన సంక్షేమాన్ని, అభివృద్ధిని కళ్ళతో చూస్తున్నారన్నారు. ఏడాదిలోపే సగానికి పైగా హామీల అమలు చేశామని, మిగలిన హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే దొంగ నాటకాలను ఇకనైనా కట్టిపెట్టాలన్నారు.

మహిళలపై విచక్షణ రహితంగా

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

శాంతిపురం మండలంలోని జీడగుట్ల గ్రామంలో భూసమస్యపై జరిగిన గొడవలో విచక్షణ రహితంగా మహిళలపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్య ఉంటే సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కారం చేసుకోవాలి తప్ప భౌతికంగా దాడి చేయడం దారుణం. మహిళలను చిన్న పిల్లలను కర్రలతో కొట్టడం రాళ్ల విసరడం ఆపరేషన్ చేసుకున్న మహిళలను కూడా కొట్టడం దారుణమన్నారు. దాడి జరిగిన మహిళలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారిగా

ఆనందబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారిగా కె.ఆనందబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలోని పిఐయు సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై పరిపాలనాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీకి జాయినింగ్ రిపోర్ట్ అందజేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో పాలన వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయాన్ని పెంచి, ప్రజా ప్రతినిధులు, మీడియా సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా పనిచేస్తానని పేర్కొన్నారు.

చౌక దుకాణం షాప్ ఓపెనింగ్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో చౌక దుకాణాన్ని సోమవారం టిడిపి నేతలు ప్రారంభించారు. జిల్లా టిడిపి టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం మాట్లాడుతూ పేదప్రజలు రేషన్ పంపిణీ వాహనాల వల్ల పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలో రేషన్ పంపిణీ శ్రీకారం చుట్టారని తెలిపారు. వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఇచ్చే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షుల రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, వీఆర్ఏలు ఆశీర్వాదం, శీను, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ పాల్గొన్నారు.

తాగునీటి పైపు మరమ్మతులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం :

మండలంలోని ఆళ్లమడుగు దళితవాడలో గత 10 రోజులుగా తాగు నీళ్ల పైప్ లైన్ పగిలి పోయి నీరు మొత్తం వృథా గా పోతుండటం గమనించిన సెక్రటరీ మునిరాజ్ చూసి వెంటనే స్పందించి సొంత నిధులతో పైపు లైను మరమ్మతు చేయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంగ్ల నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ఆంగ్ల నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు తథ్యమని పినాకా ట్రస్టు అధినేత ఐఆర్ఎస్ యాదగిరి అన్నారు. పినాకా ప్రజాసాధికార ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి, పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు ఎలా నైపుణ్యాన్ని పెంచుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఆంగ్ల నైపుణ్యం తప్పనిసరన్నారు. ప్రస్తుతం ఉద్యోగ ఇంటర్వ్యూలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారని అందులో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనికి ఆంగ్లంలో నైపుణ్యం పెంచుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నమశ్శివాయం, కోర్సు డైరెక్టర్ మునస్వామి, ఫ్యాకల్టీ రవిశంకర్, మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషను గుర్తించండి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణ పరిధిలో ప్రాంతీయ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ చేలేపల్లి మాజీ సర్పంచ్ శివశంకర్ కడా పీడీ వికాస్ మరమ్మత్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో అధికార, పరిపాలన భాషగా తెలుగు ఉందన్నారు. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రాంతీయ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల నామపలకాలు తెలుగులో ఉండాలని, అయితే కుప్పం నియోజకవర్గంలో మాత్రం ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనాలకు, ఈ భవనాలలో ఏర్పాటు చేసిన కడా కార్యాలయనికి మాత్రం ఆంగ్లంలో నామ పలకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు తెలుగులో ఏర్పాటు చేయాలని కోరారు.

మండలానికి చేరిన విద్యాసామగ్రి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందించాల్సిన విద్యాసామగ్రి, స్కూల్ బ్యాగులు 7190 చేరినట్లు మండల విద్యాశాఖ అధికారివేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

యోగ ప్రాధాన్యత తెలుసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యోగాను రోజువారీ దినచర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం పులిగుండు వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పర్యాటక ప్రాంతాలలో యోగపై అవగాహన కల్పించేందుకు ఇది వరకే పర్యాటక కేంద్రమైన కాణిపాకం దేవస్థానంను సమన్వయం చేసుకొని యోగాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించామన్నారు. పులిగుండులో సోమవారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో 2,300 మంది దాకా భాగస్వాములై విజయవంతం చేయడం జరిగిందన్నారు నిర్వహిస్తున్నమని తెలిపారు. ఇప్పటి వరకు సుమారుగా రెండు లక్షల యాభై వేల మంది యోగాంధ్రా-2025 లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ప్రతిరోజు ఒక అరగంట వారివారి రోజువారి ప్రణాళికలో యోగాను చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుందని, తద్వారా చేసే పనిలో ఆటంకాలు లేకుండా చేసుకోవచ్చునని తెలిపారు. జూన్ 21వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 5 వేల మంది యోగా శిక్షకులు ఉన్నారని, సమయం దొరికినప్పుడు ప్రతి ఒక్కరూ యోగ చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ ప్రాధాన్యత తెలుసుకునేందుకు ప్రభుత్వం వారు నెల రోజుల వరకు గ్రామ, మండల, జిల్లా రాష్ట్రస్థాయిలో యోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, సోమవారం పులిగుండులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి- పలమనేరు: ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి ఇప్పటికే పలమనేరు వ్యవసాయ సబ్ డివిజన్ సంబంధించి 7మండలాల్లో 7075.2 క్వింటాళ్ళు 40శాతం సబ్సిడీపై వేరుశెనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు పలమనేరు సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి గీత తెలియజేశారు. పలమనేరుకి 672 క్వింటాళ్ళు, బైరెడ్డిపల్లికి 1313.1 క్వింటాళ్ళు, వికోటకి 1346.4 క్వింటాళ్ళు, రామకుప్పం కి 1072.5 క్వింటాళ్ళు, శాంతిపురం కి 1403.1 క్వింటాళ్ళు, కుప్పం కి 848.7 క్వింటాళ్ళు ,గుడిపల్లికి 419.4 క్వింటాళ్ళు విత్తన వేరుశనగ ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచడమైనదని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక కేజీ వేరుశనగ కె-6 రకం పూర్తి ధర 93 రూపాయలు కాగా రాయితీ రూ.37.20లు పోను రైతు చెల్లించవలసినది రూ.55.80లు అన్నారు. ఒక బస్తా 30 కేజీలు పూర్తి ధర రూ.2790లు కాగా రాయితీ రూ.1116లు పోను రూ.1674లను రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రాలలో అర్హులైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరు రైతు తీసుకురావాలని తెలిపారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. వేరుశనగ విత్తన కాయలు తీసుకున్న ప్రతి ఒక రైతు, వేరుశెనగ పంట తప్పనిసరిగా సాగు చేస్తామని ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

వి కోట: ప్రభుత్వం రాయితీపై రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి మండలంలో సిద్ధంగా ఉన్నాయని ఏవో రాజ్యలక్ష్మి సోమవారం తెలిపారు. ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి వీకోట మండలానికి 1346.1 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనం కె-6 రకం 22 రైతు సేవా కేంద్రాలలో పంపిణీ కొరకు అందుబాటులో ఉంచడమైనదన్నారు. మండల పరిధిలో ఈనెల 4న బైపల్లి, బోడిగుట్లపల్లి, చింతమాకులపల్లి, గోనుమాకులపల్లి, కుంభార్లపల్లి, మద్దిమాకులపల్లి, ముదరందొడ్డి, పడిగలకుప్పం, పాముగానిపల్లి, పెద్దభరినేపల్లి, తోటకనుమ గ్రామాల్లో, 5న కొంగాటం, నెర్నిపల్లి, బోయచిన్నా గనపల్లి, సుద్దులకుప్పం, యాలకల్లు గ్రామాల్లో, 6న జవునిపల్లి,పత్రపల్లి, శివునికుప్పం, వి.కోట, ఓగు, 9న కృష్ణాపురం రైతుసేవా కేంద్రాలలో విత్తన పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మండలాభివృద్ధికి కలిసి పని చేద్దాం: ఎంపీపీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలం అభివృద్ధి కోసం అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి పని చేద్దామని ఎంపీపీ సరిత ప్రజాప్రతినిధులు అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సరిత అన్ని శాఖల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీల వారీగా సమీక్షించారు. విద్యాశాఖ అధికారి సబర్మతి మాట్లాడుతూ పదవ తరగతిలో ఫలితాలు తక్కువ వచ్చాయని దిగులు పడి కూర్చోకుండా కలిసికట్టుగా పని చేద్దామని, ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ పాఠశాలలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఉపాధ్యాయుల పిల్లలు ప్రైవేట్ స్కూల్‌లో పేదల పిల్లలు ప్రభుత్వ పాఠశాల చదువుతున్నారని ఎన్.ఆర్ పురం ఎంపీటీసీ నాయుడు అన్నారు. రెవెన్యూ సంస్థలు సర్టిఫికెట్ల మంజూరు భూసమస్యలపై తహశీల్దార్ లోకనాథ పిళ్ళై వివరించారు. ఆర్డబ్ల్యూఎస్‌లో కొత్తపల్లి మాత్రం చేయడం లేదని కోఆప్షన్ మెంబర్ యేసు రత్నం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి జడ్పీ నిధులతో నిచ్చిన ఏర్పాటు చేయాలని జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి ఎంపీడీవోకు సూచించారు. ఆర్డబ్ల్యూఎస్‌లో నిధులు వాటి వినియోగంపై ఏఈ సభకు తెలిపారు. సభకు హాజరు కాని శాఖలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారి పై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, ఈవోపిఆర్డి కోదండ రామిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ సరిత

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.!

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి రుచికరమైన, శుభ్రతతో కూడిన భోజనం అందించాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ జెడ్పిటిసి మునస్వామి కోరారు. సోమవారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీ సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభం నుంచి సన్న బియ్యాన్ని అందించి పిల్లలకు మంచి భోజనం అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ప్రైవేట్ పాఠశాలల దీటుగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ 2 నారాయణ , వైస్ ఎంపిపి వెంకట్రామ గౌడు, రాష్ట్ర నేత నారాయణ చారి, మహమ్మద్ రఫీ, కామరాజు నాయక్, రాజేంద్ర పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మహిళా రిసోర్స్ పర్సన్ జ్యోతి భోజనం వండేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు అనుసరించవలసిన పరిశుభ్రతా నియమాలు గురించి వివరించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ శశి కుమార్ మధ్యాహ్న భోజన పథకంలో నూతన మార్పులను గురించి వివరించారు. మండల రిసోర్స్ పర్సన్ సిఆర్పి రామచంద్ర మధ్యాహ్న భోజన పథకం మానిటరింగ్ వ్యవస్థ గురించి, మారిన మెనూ డెమో ద్వారా వివరించడం జరిగింది.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విశ్రాంతి ఉపాధ్యాయులు జోహార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులలో భాగంగా వృక్షో రక్షితి రక్షితం అంశంపై చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని అన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలపై నిరసనగా జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తెలిపారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, నాయకులు ముని రాజారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, చిన్నమ రెడ్డి, సురేంద్ర రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, ఏకాంబరం, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

నిరసనకు అనుమతి ఇవ్వండి: మాజీ ఎంపీ రెడ్డప్ప

పుంగనూరు: 4న చేపట్టే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప సోమవారం అర్బన్ సిఐకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. అన్ని మండలాలకు చెందిన నాయకులు అనుబంధ సంస్థల ప్రతినిధులు, వైసీపీ ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహిస్తామని తహశీల్దార్ వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈకార్యక్రమాన్ని శాంతియుతంగా సజావుగా నిర్వహించేందుకు అనుమతి ఇచ్చి సహకరించవలసిందిగా కోరారు.మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాష, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, ఫక్రుద్దీన్ షరీఫ్, రాజశేఖర్ రెడ్డి, పిఎన్ఎస్ ప్రకాష్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

సోమల: ఈనెల నాలుగవ తేదీ వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మొత్తం విజయవంతం చేయాలని, సీఎం చంద్రబాబు బూటకపు హామీలు, ప్రజలను మోసం చేయడం అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గోడ పత్రికలను సదుం ఆర్టీసీ బస్టాండ్ సముదాయం వద్ద ప్రజా ప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు కార్యకర్తలు ఆవిష్కరించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, మాజీ అమాస మోహన్, నాగేశ్వరరావు, శ్రీరాములు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

విజయపురం (నగరి): వెన్నుపోటు దినం కార్యాక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మాజీ మంత్రి ఆర్కేరోజా నివాస కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం సోమవారం ఆవిష్కరించారు. 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి అనుమతులు కోరుతూ ఆర్డీవో భవానీ శంకరి, పోలీసులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప పాల్గొన్నారు.

కార్వేటినగరం: 4న పెద్దఎత్తున నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మండల నాయకులతో కలసి వెన్నుపోటు దినం పోస్టర్ను ఆవిష్కరించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ, చందురాజు, ముస్లిం యువనాయకుడు తౌఫిర్భాన్, మున్నా, ప్రభాకర్రెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మణి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9 గంటలకు 49 కొత్తపల్లి మిట్ట ప్రధాన కూడలి వద్ద నియోజకవర్గంలోని 6 మండలాలకు సంబంధించిన మండల అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సరిత, వైఎస్ఆర్సిపి నాయకులు జనార్ధన్, చిన్నప్ప, భూపతిరెడ్డి, బాబు, యువరాజు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను మోసాలను ఎండగడుతూ చంద్రబాబు పాలనపై నిరసనగా ఈనెల నాలుగవ తేదీ వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రమాదంలో గాయపడిన వారు, మృతి చెందిన వెంకటస్వామి

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు- పీలేరు ప్రధాన రహదారి మార్గంలో కల్లూరు సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు బైకును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ మీద వెళుతున్న ఈ. రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ చిగర మాకులపల్లికు చెందిన దంపతులు వెంకటస్వామి, నారాయణమ్మ, వారి అల్లుడు కల్లూరు పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లికు చెందిన వాసు ద్విచక్ర వాహనంలో కల్లూరు నుండి వారి స్వగ్రామం చిగరమాకులపల్లికు వెళ్తుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందిన వెంటనే కల్లూరు సబ్ ఇన్స్పెక్టర్ యు.వెంకటేశ్వర్లు, సిబ్బందితో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తీవ్రంగా గాయపడిన వెంకటస్వామి (62) ఆసుపత్రిలో మృతి చెందాడు. గాయపడిన మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

నాటు బాంబు పేలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నాటు బాంబు పేలి యువకుడికి గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని వెలుతురు చేను పంచాయతీ పులిమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. సిఐ ఇచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన చిన్నయ్య కుమారుడు వినాయక (35) తమిళనాడు నుంచి మందుగుండి సామాగ్రి తెచ్చి వన్యప్రాణులను వేటాడేందుకు నాటు బాంబులు తయారు చేసి ఆ మాంసంను విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో ఆయన తయారుచేసిన నాటు బాంబు కాలికి తగిలి పేలడంతో కుడి కాలి పాదం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి, తర్వాత తిరుపతి రమాదేవి ఆసుపత్రికి తరలించారు. సిఐ శ్రీనివాసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అంబులెన్స్ ఖర్చులకు రూ.5వేలు సాయం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం నాయనూరు పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన సెల్వరాజు అనారోగ్యంతో బాధపడుతుండగా అతని కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం బాధితున్ని పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. బాధితున్ని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యసేవల నిమిత్తం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈసమాచారం అందుకున్న కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ పిఇఎస్ ఆసుపత్రికి చేరుకుని, భాధితున్ని పరామర్శించారు. స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లడానికి అంబులెన్స్ ఖర్చుల నిమిత్తం రూ.5వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

టిడిపి కార్యకర్తకు ఘన నివాళులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కంగుంది గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త మురుగేష్ మృతికి స్థానిక టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మురుగేష్ సోమవారం తుది శ్వాస విడవడంతో సమాచారం అందుకున్న ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం మృతుడి ఇంటి వద్దకు చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆర్థికంగా ఆదుకుంటాం..

ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం కంగుంది పంచాయతీ అంబాపురం గ్రామానికి చెందిన కన్నప్ప అనారోగ్యంతో బాధపడుతూ కుప్పం పట్టణంలోని శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం అందుకున్న టిడిపి నాయకులు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, టీటీడీ పాలకమండలి సభ్యులు శాంతారామ్‌తో కలిసి స్థానిక టిడిపి నాయకులు బాధితున్ని పరామర్శించారు. కన్నప్ప పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని, గతంలో విఎస్-ఎస్ అధ్యక్షులుగా సైతం సేవలు అందించారని అన్నారు. అతనికి మనో ధైర్యాన్ని కల్పిస్తూ, పార్టీ తరపున అండగా ఉంటామని, ఆసుపత్రి ఖర్చులు సైతం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

భక్తులను ఆకట్టుకున్న హరికథ గానం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజు మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం పాండవుల జననం హరికథ గానం భక్తులను ఆకట్టుకుంది. భాగవతారిణి ఉషారాణి పాండవుల జననం గురించి వివరించారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, ఎత్తురాజుల నాయుడు, కేశవులు నాయుడు, సర్పంచ్ హరిత కుప్పయ్య పాల్గొన్నారు.